"ప్రస్తుతం మీరేం చేస్తున్నారు?" అనడిగాడు వాళ్ళ టాపిక్‌ని కట్ చేస్తూ.

"ఇంట్లోంచి పారిపోయి దేశంలోని వూళ్ళన్నీ తిరుగుతూ చేతనైన పని చేసుకుంటూ బ్రతికాను.

ఎంత తెగతెంపులు చేసుకున్నా రక్త సంబంధం వూరుకోనివ్వదు కదా. ఇంటి వైపు మనసు లాగింది. బెజవాడ వెళ్ళాను. అక్కడ మా వాళ్ళంతా బాగానే వున్నారు. అన్నదమ్ములు నా వాటా పొలం వాళ్ళే వుంచేసుకుని దాని బదులు నాకు డబ్బు యిచ్చేశారు. దాన్ని బ్యాంకులో ఫిక్సిడ్ చేశాను. ఆ వడ్డీతో హాయిగా జీవిస్తూ మళ్ళీ వూళ్ళు తిరుగుతూ కాలక్షేపం చేద్దామనుకుంటున్నాను. నాకు ట్రావెలింగ్ అంటే చాలా యిష్టం" అని చెప్పాడు వరప్రసాదం.

"ఎక్కడెక్కడ తిరిగారు?" అడిగాడు అభిరాం.

"ఇక్కడక్కడనేముంది? భారతదేశంలో అన్ని ప్రదేశాలూ చూసేశాను. అన్ని సంస్కృతులూ తెలుసుకున్నాను. హిమాలయాలకు కూడా వెళ్ళాను."

"హిమాలయాలకు వెళ్ళారా?"

"అవును."

"అక్కడేం విశేషాలుంటాయి?"

"అబ్బో చాలా వుంటాయి. అవునూ నీ చేతిలో వున్న ఆ పుస్తకం ఏమిటి?" అభిరాం చేతిలో వున్న పుస్తకం అట్టమీద ఓ మాంత్రికుడు పూజ చేస్తున్న బొమ్మ వుంది.

'మాంత్రికుడు' అన్న టైటిల్ చూసి ఆసక్తిగా అడిగాడతను.

"ఇది తాంత్రిక ప్రపంచంలోని, తాంత్రికుల జీవన శైలి. తంత్రలోని అద్భుత విషయాల మీద ఓ రచయిత పరిశోధించి రాసిన ఇన్వెస్టిగేటివ్ నవల."

"పూర్తిగా చదివేశావా?"

"లేదు! మధ్యలో వున్నాను."

"మంచి విషయాలు వున్నాయా?"

"పూర్తిగా లేవు. సంక్షిప్తంగా వున్నాయి. ముందు ముందు వుంటాయోమో?"

"అది పూర్తిగా చదివి చెప్పు బాబూ ఎలా వుందో-- నీకిటువంటి సబ్జెక్ట్సంటే ఇంట్రెస్టా?"

"అవును" అన్నాడు అభిరాం.

"నాక్కూడా! ఎందుకంటే నేను వూళ్ళుపట్టి తిరుగుతున్నప్పుడు కాశీలోనూ, హిమాలయాల్లోనూ, మరెన్నో నగరాలలోనూ నాకెందరో మంత్రగాళ్ళూ, తాంత్రికులూ తగిలారు. వారు చెప్పిన విషయాలు, వారు చూపించిన అద్భుతాలు అమోఘమైనవి."

"మీరు మానవాతీత శక్తుల్ని నమ్ముతారా?"

"ముందు నమ్మకముండేది కాదు. నా ప్రయాణాల్లో దేశమంతటా చుట్టబెడుతూన్నప్పుడు నాకు తారసపడిన గొప్ప గొప్ప వ్యక్తుల మహత్తులు చూశాక నమ్మకం ఏర్పడింది" అన్నాడు ప్రసాదం.

"మంత్రశక్తులు వున్నాయంటారా?"

"తప్పకుండా."

"మరి చాలమంది వాటిని ఒప్పుకోరు!"

"ఎవరు వాళ్ళు? కేవలం గిరి గీసుకున్నట్టు ఒక చట్రంలో బంధింపబడిన వ్యక్తులే అలా అంటారు. నాలా దేశమంతటా తిరిగిన ఏ వ్య క్తినైనా అడగండి. మనదేశంలో లేని విద్య లేదని ఒప్పుకుంటారు" అని అన్నాడు వరప్రసాదం.

"మీరు కబుర్లు చెప్పుకుంటూండండి. నేను వంట చేస్తాను" అక్కడ్నుంచి లేస్తూ అంది సుమతమ్మ.

"మీరు కలిసిన వ్యక్తులూ, ప్రదేశాలూ, మీరు చూసిన అద్భుతాలూ ఏవన్నా వుంటే నాకూ వివరించండి. అటువంటి విషయాలంటే చాల ఇంట్రస్ట్ నాకు" అన్నాడు అభిరాం.

"తప్పకుండా" వాళ్ళలా మాట్లాడుకుంటూనే వున్నారు.

ఓ అరగంట తర్వాత "భోజనాలకి రండి" అంది సుమతమ్మ.

అభిరాం, వరప్రసాదం డైనింగ్‌టేబుల్ వైపు నడిచారు. అక్కడికి దగ్గరలోనే వున్న వాష్ బేసిన్‌లో ముఖం, చేతులూ శుభ్రంగా కడుక్కుని, తుండుతో తుడుచుకున్నాడు వరప్రసాదం.

గుత్తి వంకాయకూర, ఉల్లిపాయలు తరిగి చేసిన పెరుగు చట్నీ, అరటికాయ-శెనగపిండి- బియ్యపు పిండితో కలిపి చేసిన కట్‌లెట్స్, పప్పుపులుసు, ఆవకాయలతో డైనింగ్ టేబుల్ మీదున్న వంటకాలు చూస్తేనే నోరూరించేలా వున్నాయి.

"అబ్బా! ఎన్నిరకాలు చేశావక్కా?" కూర్చుంటూ అన్నాడు వరప్రసాదం.

"ఒక కూరతో తినే అలవాటులేదు నా మనవడికి. రెండుమూడు రకాలుండాలి" ఇద్దరికీ వడ్డిస్తూ అందామె.

"అబ్బా! గుత్తొంకాయకూర అద్భుతం" ఓ ముద్ద కలుపుకు తిని అన్నాడు వరప్రసాదం.

"మా ఇల్లెలా కనిపెట్టావురా?" అడిగిందామె.

"దేశాటనం చేసి ఇంటికెళ్ళగానే అడిగింది ముందు నీ గురించే. చిన్నతనంలో నువ్వు నన్నెంత మురిపెంగా చూసుకునేదానివో నాకింకా గుర్తే. అందుకే నిన్ను తప్పకుండా చూడాలనుకున్నాను.

నీకు పెళ్ళయి హైదరాబాద్ వచ్చేశావని తెలిసింది. మీవాళ్ళని అడిగితే వాళ్ళు చెప్పారీ అడ్రస్. సరాసరి వచ్చేశాను" అన్నాడతను.

ఇద్దరికీ కొసరి కొసరి వడ్డించిందామె.

"నీ ఆదరణ, ఆప్యాయతల్లో ఏ మార్పు రాలేదక్కా" ఆమె వైపు అభిమానంగా చూస్తూ అన్నాడు.

"నువ్వు పెళ్ళి చేసుకోకుండా అలా వుండిపోవటం ఏమిట్రా? కాలూ, చేయీ బాగున్నంతవరకూ ఫర్వాలేదు. తర్వాతెలా?" అని అన్నదామె.

“అన్నిటికీ షిర్డీసాయే వున్నాడు. మర్చేపోయాను. నువ్వూ భోజనానికి కూర్చో-- మేం మాక్కావలసింది వడ్డించుకుంటాంలే.”

“అమ్మమ్మకి స్వయంగా తాను వడ్డిస్తూంటే మనం తినటమే ఇష్టం. తను తర్వాత తింటుంది” అన్నారు అభిరాం.

ఇద్దరూ భోజనాలు ముగించారు.

“అమ్మమ్మా! నేనూ, వీరూ నా గదిలోనే పడుకుంటాం. వీరు చాలా ప్రదేశాలు తిరిగారటగా. ఆ విషయాలు చెబుతారు నాకు” అన్నాడు అభిరాం.

“సరే” అంది సుమతమ్మ.

అభిరాం, వరప్రసాదంలు అభిరాం బెడ్‌రూంలోకి నడిచారు. అభిరాం పల్చటి టీషర్ట్, షార్ట్ ధరించి మంచంమీద కూర్చున్నాడు.

వరప్రసాదం లుంగీ, బనియన్‌లోకి మారిపోయాడు.

“ఇప్పుడు చెప్పండి” అన్నాడు అభిరాం.

“చెబుతాను అంటూ బెడ్ పక్కనే ఉన్న కుషన్ చైర్లో కూర్చున్నాడు వరప్రసాదం.

నశ్యం డబ్బాలోంచి కొంత పొడి తీసుకొని పీల్చాడు. వెంట వెంటనే నాలుగైదుసార్లు తుమ్మాడు. అభిరాం అతన్నే చూస్తూండిపోయాడు.

“మొదలుపెడితే అర్థరాత్రి దాటిపోవచ్చు. నీ నిద్ర పాడవుద్ది ఫర్వాలేదా?” అడిగాడు వరప్రసాదం.

“తెల్లవార్లూ చెప్పినా నాకభ్యంతరంలేదు” అన్నాడు అభిరాం ఉత్సాహంగా.

“సరే అయితే! ముందుగా హిమాలయాల దగ్గర్నుంచీ నా అనుభవాలూ, నేను చూసిన సంఘటనలూ, విన్న విచిత్రాలూ, కన్న అద్భుతాలూ అన్నీ చెబుతాను ..... ” అన్నాడు.

అభిరాం ఉత్సాహంగా అతనివంక చూడసాగాడు.

“హిమాలయాలు దాదాపు రెండువేల నాలుగు వందల కిలోమీటర్ల పొడవున్న పర్వతాలు--

వీటిలో నేపాల్, టిబెట్ సరిహద్దున ఇరవైతొమ్మిదివేల అడుగుల ఎత్తున్న ‘ఎవరెస్ట్’ ప్రపంచంలోకెల్లా ఎత్తయిన పర్వతం. హిమాలయం అనేది సంస్కృత పదం. హిమం అంటే మంచు. ఆలయం అంటే నివాసం. హిమాలయం అంటే యిల్లు అని చెప్పవచ్చు. అది కేవలం మంచుకొండ మాత్రమే కాదు. యోగ విజ్ఞానానికీ, ఆధ్యాత్మికతకూ పుట్టిల్లు. ఈనాటికి కూడా అతి ప్రాచీనమైన, ఘనమైన సంప్రదాయం వుందక్కడ.

పంజాబ్ హిమాలయాలనుండి కుమావూన్, ఘర్వాల్ హిమాలయాల వరకూ, సిక్కిం నుండి భూటాన్, టిబెట్ వరకూ-మామూలు యాత్రికులు వెళ్ళలేని చోట్లలో తిరిగాను. అలాంటి సమయంలోనే ఒకసారి చావు తప్పి కన్ను లొట్టపోయినంత పనయింది” అంటూ ఆపాడు వరప్రసాదం.

“ఏం జరిగింది?” ఆతృతగా అడిగాడు అభిరాం.

“ఆక్సిజన్ లేకుండా హిమాలయాలలో ఇరవైవేల అడుగుల ఎత్తుకు వెళ్ళకూడదు. ఆ విషయం నాకు తెలియక అంత ఎత్తుకి వెళ్ళాను.

అంతే ప్రాణవాయువు అందక ఉక్కిరిబిక్కిరైపోతూ, కారణం తెలియక అయోమయంలో పడిపోయి ఒడ్డునపడ్డ చేపలా గిలగిలా కొట్టుకుంటుండగా ఒక యోగి నన్ను ఆదుకున్నాడు ..... ”

“ఎలా?” అతని మాటలు పూర్తవకముందే అడిగాడు అభిరాం.

“ప్రాణవాయువు అందక నేను నరకయాతన పడుతుంటే అతను మాత్రం అతి మామూలుగా, నేలమీద ఉన్నట్లే ఉచ్ఛ్వాస నిశ్వాసలు తీస్తూ, ఏవో మంత్రాలుచ్ఛరించి, నా తలపై తన చేత్తో నిమిరాడు. అంతే ..... కొన్ని క్షణాలు ..... కేవలం కొన్ని క్షణాల్లోనే మామూలుగా- అయిపోయాన్నేను. దాదాపు మరణం అంచుకు చేరుకున్న నన్ను కాపాడిన ఆ యోగి నాకు స్థిమితం కలగడం చూసి మారు మాట్లాడకుండా వెళ్ళిపోసాగాడు. నాకతనితో మాట్లాడాలనీ, నాకందని ప్రాణవాయువు అతనికెలా అందిందని అడుగుదామనీ ఆ యోగిని వెంబడించాను.

అలా చాలాసేపు అతను నడుస్తూనే వున్నాడు. నేనూ పట్టువిడవక ఆయన్ని అనుసరిస్తూనే వున్నాను. కొంచెంసేపటికి ఆయన నడవటం ఆపి

“నువ్వెవరివి నాయనా? నావెంట ఎందుకొస్తున్నావ్” అని శాంతస్వరంతో అడిగాడు.

నేను నా పేరు చెప్పి, నా విఫల ప్రేమగాథ ఆయనకి వివరించి

“ఊపిరాడక చావుబతుకుల్లో వున్న నన్ను కేవలం చేతిస్పర్శతో ఎలా కాపాడగలిగారు? నాకందని ప్రాణవాయువు మీకెలా అందుతోంది?” అని అడిగాను.

అప్పుడే సాయంత్రమవుతోంది. మబ్బుల్ని చీల్చుకుని వచ్చిన సాయం సూర్యుడు తన కిరణాన్ని ఆ హిమం అంతటా వెదజల్లుతుంటే గొప్ప చిత్రకారుడైన ఆ పరమాత్ముడు లక్షలాది రంగులను మంచు శిఖరాలపై గుమ్మరించాడా అన్నట్లుంది. ఇది అని మాటల్లో వర్ణించలేని మానసికానందం!

యోగి చిరునవ్వుతో ఆ నీరెండలో ముందుకు సాగిపోయాడేకానీ నా ప్రశ్నలకి సమాధానం మాత్రం చెప్పలేదు. నేనతన్ని వదల దలచుకోలేదు. అతనివెంట మళ్ళీ పడ్డాను.

అది జులై మాసం. హిమాలయాలలో ప్రయాణానికి ఆ మాసం అనువైనది. అప్పటికి మంచుతిప్పలు కరిగిపోతాయి. చల్లదనం కూడా ఒంటికి హాయిని కలిగించే స్థాయిలోనే వుంటుంది. కొండచరియలు విరిగి పడటం, హిమపాతం మొదలైన ప్రమాదాలు తక్కువ. ఆ విషయాలు నాకు ముందుగా తెలియకపోయినా నా అదృష్టం కొద్దీ ఆ సమయంలోనే నేను హిమాలయాలకు వెళ్ళగలిగాను.

“మరా యోగితో మాట్లాడారా? అతను మీ ప్రశ్నలకి జవాబు చెప్పాడా?”అడిగాడు

అభిరాం.

"చెబుతా! నేను యోగిని అనుసరించి వెళుతున్నానే కానీ, చాలా కష్టంగా వుంది నాకు. అతను మాత్రం ఏ ఎగుడూ దిగుడూ లేని సాఫీ నేలపై నడిచి వెళ్ళిపోతున్నట్లు ఆ పర్వత సానువులపై అతి సునాయసంగా సాగిపోతున్నాడు. ఇంకతన్ని వెంబడించటం అసాధ్యమనిపించింది నాకు.

అదే సమయంలో ఆ యోగి ఒక గుహలోకి నడిచాడు. నేనూ అందులోకి ప్రవేశించాను. ఎత్తయిన బండలాంటి దానిమీద ఆ యోగి కూర్చుని వున్నాడు. నేనతని సమీపంలో నేలపై కూర్చున్నాను. ఆయాసంతో ఒక్కటే రొప్పుతున్నాను నేను. అతను మాత్రం ప్రశాంత దృక్కులతో, ఏ అలుపూ లేకుండా నావైపే చూస్తున్నాడు.

కొన్ని నిమిషాలు గడిచాయి. నా అలసట తగ్గింది. అప్పుడు పెదవి విప్పి మాట్లాడాడతను--

"ఏమిటి నాయనా నీ సందేహం?" అని.

"స్వామీ! ప్రాణవాయువు అందక మృత్యువుకి దగ్గరైన నన్ను మీరెలా కాపాడారు? నాకందని ప్రాణవాయువు మీకెలా అందింది?" అని ప్రశ్నించాను.

"హిమాలయ పర్వతాలపై ఇరవైవేల అడుగులలోపే ప్రాణవాయువు అందుతుంది. ఆపైన ప్రాణవాయువు వుండదు.

ఏ ప్రాణి అయినా సరే ఆ ఎత్తుకి వెళితే మృత్యువుని చేరుకున్నట్లే. నీకా సంగతి తెలియక ఆ దుస్సాహసానికి ఒడిగట్టావ్. ప్రాణంమీదకు తెచ్చుకున్నావ్ అని వివరించాడతను."

"మరి అంత ఎత్తులో మీకందని ప్రాణవాయువు అతనికెలా అందిందో వివరించలేదా?" వరప్రసాదం చెప్పడం ఆపేయడంతో గబగబా అడిగాడు అభిరాం.

"అదీ అడిగా ..... దానికతడు చిరునవ్వు నవ్వి ఇలా చెప్పాడు- స్త్రీ పురుషులు శిశువులుగా జన్మించినపుడు కొందరు శిశువులు మృతులై పుడతారు.

దీనిక్కారణం ఆ శిశువుకి బొడ్డునందు శ్వాసలేకపోవడమే. పుట్టిన ఆరుగంటలకి శిశువు మరణిస్తే ఆ శిశువుకు అయిదువేల నాలుగువందల శ్వాసలు బొడ్డులో వున్నాయన్నమాట. ఆ ఆరుగంటలలో ముక్కుద్వారాల నుంచి, నడిచి, నడిచి ఆ శ్వాస అంతా ఖర్చయి ఆ శిశువు మరణిస్తుంది.